## బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సింగిరెడ్డి వాసంతి

పెద్దమందడి, అక్టోబర్ 20 : మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన వడ్ల యాదయ్య సోదరుడు సిద్ధయ్య శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి గ్రామానికి చేరుకొని మృతుని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు మాజీ ఎంపీటీసీ సత్యారెడ్డి, శివారెడ్డి, రామన్‌గౌడ్, అమృత్‌రెడ్డి, సతీశ్, సేనాపతి, ఉన్నారు.

## వివిధ రూపాల్లో అమ్మవారు

వనపర్తి టౌన్, అక్టోబర్ 20 : జిల్లాకేంద్రంలోని ఆలయాలు, మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు శుక్రవారం వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య ఆలయంలో లక్ష్మీదేవీగా, అయ్యప్ప స్వామి ఆలయంలో లక్ష్మీదేవీగా, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సరస్వతీ దేవీగా, వేంకటేశ్వర స్వామి ఆలయంలో విద్యాలక్ష్మి దేవీగా, మున్నూరు కాపు మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు సరస్వతి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, అభిషేకాలు, మహా మహ మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రఘునాథచార్యులు, చెన్నయ్య, భాస్కరాచారి, హిమవంతు, రమేశ్‌శర్మ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా బతుకమ్మ సంబురం



శ్రీరంగాపురంలో బతుకమ్మ వద్ద చిన్నారులు

శ్రీరంగాపురం, అక్టోబర్ 20: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ మూడో సెంటర్‌లో శుక్రవారం బతుకమ్మ ఉత్సవాలను జరుపుకొన్నారు. తీరొక్కపూలతో బతుకమ్మ తయారు చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలు పాడుతూ చిన్నారులు సందడి చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మంజులారాణి, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భౌతికశాస్త్రంలో డాక్టరేట్ పొందిన సౌజన్య



డాక్టరేట్ అవార్డు పొందిన సౌజన్య

వనపర్తి టౌన్, అక్టోబర్ 20: వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన సౌజన్య భౌతికశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందారు. జిల్లా కేంద్రానికి చెందిన పగిడాల గోపాల్, అలివేల దంపతుల కుమార్తె సౌజన్య ఉస్మానియా యునివర్సిటీ భౌతికశాస్త్రం విభాగంలో విశ్రాంత ఆచార్యులు ఎంవీ రమణారెడ్డి పర్యవేక్షణలో 'సింథసిస్ ఆండ్ ఇన్వేస్టిగేషన్ ఆఫ్ స్ట్రక్చరల్ స్పెక్ట్రోస్కోపిక్ డై ఎలక్ట్రిక్ ఆండ్ మ్యాగ్నటిక్ ప్రాపర్టీ ఆఫ్ నికెల్, కోబాల్ట్ ఫర్ ఎనర్జి అప్లికేషన్స్' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని ఉస్మానియా యూనివర్సిటీకి అందజేశారు. జాతీయస్థాయిలో పరిశోధనలు చేసిన అంశాలపై జనరల్స్ అందజేశారు. తనకు సహకరించిన డాక్టర్ పవన్‌కుమార్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గజ్వేల్‌లో మహిళా డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా భౌతిక శాస్త్ర విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఎంతోమంది విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు శిక్షణ ఇచ్చారు. తనకు సహకరించిన భర్త విజయ్‌కుమార్, కుటుంబ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# జోరుగా ఎన్నికల ప్రచారం

- కారుగుర్తుకు ఓటెయ్యాలని అభ్యర్థన
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాల పంపిణీ

పెబ్బేరు, అక్టోబర్ 20: మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార పర్వం కొనసాగుతున్నది. మంత్రి నిరంజన్‌రెడ్డిని రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని, మూడోసారి కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరుతూ కార్యకర్తలు వీధిబాట పట్టారు. ఇంటింటికీ తిరిగి పార్టీ మ్యానిఫెస్టో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. పెబ్బేరు పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, నాయకుడు బుచ్చారెడ్డి, కౌన్సిలర్లు తదితరులు ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోనూ సర్పంచుల ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని అభ్యర్థిస్తున్నారు.

### శ్రీరంగాపురంలో..

శ్రీరంగాపురం, అక్టోబర్ 20: మండలంలోని తాటిపాముల, వెంకటపురం, శ్రీరంగాపురంలో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగుతున్నది. ఈ సందర్భంగా శ్రీరంగాపురంలో పార్టీ సీనియర్ నాయకులు పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటి ప్రచారంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నిరంజన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మండల ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టి ప్రగతికి బాటలు వేయాలని కోరారు. శ్రీరంగపురంలో గడపగడపకు తిరుగుతూ తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి నిరంజన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అడిగారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



శ్రీరంగాపురంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## బీఆర్ఎస్‌లో రావుల చేరికపై హర్షం

గోపాల్‌పేట, అక్టోబర్ 20: వనపర్తి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో బీ ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ టి మంత్రి కే టీ ఆర్ సమక్షంలో బీ ఆర్ ఎస్ పార్టీలో చేరారు. రావుల చేరిక పట్ల మండలంలోని ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ. వాహనాలలో తెలంగాణ భవన్‌కు తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో నాయకులు జోగు శాంతన్న, వెంకటేశ్వరావు, పులేందర్, రాంచంధర్, బాలస్వామి, రమేష్, గౌడ్, శంకర్, జయరాములు, నాగరాజు, నిరంజన్, బాలయ్య తదితరులు ఉన్నారు.



తెలంగాణ భవన్‌కు తరలుతున్న రావుల అభిమానులు

# పంటలకు జలాభిషేకం

- నిండుకుండల్లా చెరువులు, కుంటలు
- మండలంలో 2,380 ఎకరాల్లో సాగు
- కళకళలాడుతున్న పచ్చని పంట పొలాలు
- చేపల పెంపకంతో మత్స్యకారులకు ఉపాధి
- పెరిగిన భూగర్భ జలాలు




శ్రీరంగాపురం, అక్టోబర్ 20: గత సమైక్య పాలకుల వివక్ష స్థానిక నాయకులు అధికార కాంక్ష వెరసి వనపర్తి నియోజకవర్గం రైతుల బతుకులు ఆగమాగం అయ్యాయి. ఉమ్మడి పాలమూరు నుంచి జీవనదులు పారుతున్న పంటచేయులకు నీరు రాక బీడు భూములుగా ఉండేవి. రైతులు నమ్ముకున్న నేలను వదలలేక పంటలు పండించేందుకు సాగునీరు అందక అప్పుల బాధలు తట్టుకోలేక ఉన్న ఊరిని కన్నవారిని వదిలి పొట్ట చేత పట్టుకొని రాష్ట్రం వదిలి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. గడంతా గతం ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ వనపర్తి నియోజకవర్గం లో మంత్రి నిరంజన్ రెడ్డి కృషితో నేడు బీడు భూముల్లో కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతున్నది. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే సీఎం కేసీఆర్ వ్యవసాయానికి పెద్ద పీట వేశారు. మిషన్ కాకతీయ పథకంతో చెరువులను, కుంటలను పూడిక తీయించి జూరాల కాలువల ద్వారా నీటిని నింపారు. పెట్టుబడి కోసం రైతులు ఆసాములపై ఆధారపడకుండా రైతుబంధుతో ఆర్థిక సాయం అందించారు. వలస వెళ్లిన రైతులు, రైతు కూలీలు తిరిగొచ్చి గ్రామాల్లో సంతోషంగా వ్యవసాయం చేసుకుని జీవనం గడుపుతున్నారు. శ్రీరంగాపురం మండలంలోని రంగసముద్రం, రామసముద్రం చెరువులను పునరుద్ధరించి 2,380 ఎకరాలను సాగులోకి తీసుకొచ్చారు. ఈ రెండు చెరువుల కింద 2,380 ఎకరాలు సాగులోకి రావడమే కాకుండా ప్రభుత్వ ఉచితంగా చేపపిల్లల పంపిణీతో మత్స్యకారులకు చేతినిండా పని, ఆదాయం లభించింది. చెరువుల్లో కుంటల్లో నీరు పుష్కలంగా ఉండడంతో ఆయకట్టు రైతులే కాకుండా భూగర్భజలాలు పెరిగి బోరు బావుల కింద వ్యవసాయం చేసుకుంటున్న రైతులు కూడా వ్యవసాయాన్ని సంబరంగా చేసుకుంటున్నారు. గ్రామాల్లో సాగు, తాగునీటి కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి గ్రామంలో ఎటుచూసినా పచ్చని పంట పొలాలు కళకళాడుతున్నాయి.

### పుష్కలంగా సాగునీరు

మండల కేంద్రంలోని చెరువును రిజర్వాయర్ గా ఏర్పాటు చేసినప్పటి నుంచి. నీళ్లు పుష్కలంగా ఉంటున్నాయి. రిజర్వాయర్లో చేపల వృత్తికి ఎంతో మేలు జరిగింది. మత్స్యకారులకు చేతినిండా పని ఆదాయం ఉండడంతో కుటుంబంతో సంతోషంగా గడుపుతున్నారు.

**- చంద్రయ్య, మత్స్యకారుడు, జానంపేట**



### రైతులకు అండగా సర్కార్



తెలంగాణ ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతులకు జీవనోపాధి కల్పించింది. మిషన్ కాకతీయ, రైతుబంధు పథకాలు రైతులకు ఎంతో మేలు చేశాయి. సాగునీరు పుష్కలంగా ఉండడంతో రైతులు ధీమాగా వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయానికి పెట్టుబడి సాయం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

**- బలరాం, రైతు, శ్రీరంగాపురం**